క్లుప్తంగా

సకాలంలో సేవలందించాలి



వార్డు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: వార్డు సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు సక్రమంగా సేవలందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని కిబులా కాలనీ, గాంధీ నగర్ సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి పలు సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలను ఆరా తీశారు. సంక్షేమ పథకాల పోస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో నిలిచిపోయిన తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్ పోస్టుల పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరెకృష్ణ, మండలాధ్యక్షుడు చిన్న వీరేష్ కోరారు. శుక్రవారం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులకు డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. డీటీఎఫ్ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, వెంకట్రాముడు, విజయభాస్కర్‌రెడ్డి, జయానంద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని బైకిస్టులకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

కృష్ణగిరి: 44వ జాతీయ రహదారిలోని అమకతాడు టోల్‌గేట్ సమీపాన బైక్‌పై వేగంగా వెళుతూ రోడ్డు పక్కనున్న ఉన్న చెట్టును ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వెల్దుర్తి మండలం సూదాపల్లె గ్రామానికి చెందిన శేఖర్, రాజు అతిగా మద్యం తాగి వేగంగా బైక్ నడుపుతూ ప్రమాదానికి గురైనట్లు వాహనదారులు తెలిపారు. ఇద్దరినీ హైవే పెట్రోలింగ్ పోలీసులు హైవే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదంపై విచారణ చేపట్టారు.

పశువుల రక్త నమూనాల సేకరణ

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామంలో గొర్రెలు, మేకల రక్త నమూనాలు సేకరించి ఆరోగ్య పరీక్ష, వ్యాధి నిర్ధారణ పరీక్షల నిమిత్తం కర్నూలు ల్యాబ్‌కు పంపడం జరిగిందని పశు వైద్యాధికారి కృష్ణనాయక్ శుక్రవారం తెలిపారు. గతంలో వ్యాధి నిర్ధారణ కొరకు నమూనాలను కర్నూలు ల్యాబ్‌కు పంపవలసి వచ్చేది. ప్రస్తుతం పత్తికొండలో మార్కెట్ యార్డు వద్ద అగ్రిల్యాబ్ అందుబాటులో ఉండడం వల్ల ఫలితాలు తొందరగా తెలుస్తాయని దీంతో త్వరగా చర్యలు చేపట్టేందుకు వీలవుతుందన్నారు.

వాహనాలు ఢీకొని డ్రైవర్‌కు తీవ్రగాయాలు

దేవనకొండ: కర్నూలు–బళ్లారి రహదారిపై కరిడికొండ గ్రామ సమీపంలో శుక్రవారం రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కర్నూలుకు చెందిన లారీ డ్రైవర్ ప్రతాప్‌సింగ్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్సలు చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేయడంతో 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

సాగునీరు విడుదల చేయాలి

చిప్పగిరి: ఏబీసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ మండల కోఆప్షన్ మెంబర్ సర్వర్‌ఖాన్ ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులు శుక్రవారం హంద్రీ–నీవా కాలువ 157వ కిలోమీటర్ వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ముందస్తు సమాచారం లేకుండా నీటిని బంద్ చేయడం తగదన్నారు. స్పందించిన డీఈ మంజునాథ్ తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పదిరోజులకోసారి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఏబీసీ కెనాల్‌కు ఈ నెల 11న నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

హెల్త్‌కార్డులు అందించండి

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రతి పేద కుటుంబానికి ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన–డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డులు అందేలా చూడాలని డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ శ్రీనివాసరావ్‌తో కలిసి స్థానిక సచివాలయం–1లో పట్టణంలోని మూడు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. హెల్త్ కార్డులు ప్రజలకు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. హెల్త్ కార్డు పొందిన వారు దేశంలోని ఏ ఆసుపత్రిలోనైనా ఉచితంగా రూ.5 లక్షల విలువ గల చికిత్సలు చేయించుకునే అవకాశముందన్నారు. స్థానిక మేజర్ పంచాయతీ ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పండుటాకులకు పింఛను ఆసరా



తిరుపతిలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆస్పరికి చెందిన చక్రాల గోవిందమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగార్జున



సంచర్లలో పింఛన్ పంపిణీ చేసేందుకు వేలిముద్రలు నమోదు చేస్తున్న వలంటీర్ వీరేష్



అనారోగ్యంతో ఆత్మకూరులో కుమారుడి వద్ద ఉంటున్న పోతుగల్లుకు చెందిన షేక్ హాజీ బాషాకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ భంభం బాషా



ఎర్రగుంట్లకు వెళ్లి వృద్ధురాలు బెలగంటి ఈరమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ క్రాంతికుమార్

పాఠశాల తనిఖీ

హొళగుంద: హెబ్బటం జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఎంఈఓ–1, 2 లు సత్యనారాయణ, జగన్నాథం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం విషయంలో ఆరోపణలు రావడంతో పాఠశాలను తనిఖీ చేసి హెచ్ఎం రంగయ్యతో కలిసి వంట ఏజెన్సీ నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద విచారణ చేపట్టారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఎంఈఓలు తెలిపారు.

నేడు ప్రారంభోత్సవం

వెల్దుర్తి (కృష్ణగిరి): రామళ్లకోటలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలను శనివారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పీఆర్‌ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



32వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 32వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ కోటకొండ నరసింహులుతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు, మంచినీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నాయకులు యూకే రాజశేఖర్, కౌన్సిలర్ శివప్రసాద్,వీరేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగనన్నకే జనం మద్దతు

గోనెగండ్ల: రాష్ట్రంలో ప్రజాబలం ఉన్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గోనెగండ్ల 4వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. టీడీపీ హయంలో ఒక్క పేదవాడికి కూడా ఇల్లు లేదా స్థలం ఇచ్చిన దాఖలాలు లేవని గుర్తుచేశారు. సంక్షేమాన్ని ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసిన ప్రజలు వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మన్సూర్, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కన్వీనర్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి కల్పిస్తాం



కందనాతి ఎస్సీ కాలనీలో అవగాహన కల్పిస్తున్న ఏపీఓ విజయమోహన్

ఎమ్మిగనూరురూరల్: వలసలు వెళ్లొద్దని అందరికి ఉపాధిహామీ పనులు కల్పిస్తామని ఏపీఓ విజయ మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కలుగొట్ల, కందనాతి గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎంత మంది వచ్చినా పనులు చూయిస్తామని తెలిపారు. దూర ప్రాంతాలకు వలసలు వెళ్లి ఇబ్బందులు పడటం కన్నా ఉన్న ఊర్లో పనులు చేసుకోవటం మంచిదని చెప్పారు. మండలంలో 750 మంది ఉపాధి పనులకు వస్తున్నారని, సోమవారం నుంచి కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. వలసలు వెళ్లే వారు తమ పిల్లలను బడి మాన్పించి వెంట తీసుకెళ్తున్నారని, పిల్లలను బడికి దూరం చేయవద్దని సూచించారు. ప్రజలు ఆలోచించుకోవాలని ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అదే విధంగా కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు విజయేంద్ర, రామకృష్ణ, రాజీవ్, సురేష్ డిమాండ్ చేశారు. ఆయా ఉక్కు పరిశ్రమల కోసం ఈనెల 8వ తేదీన నిర్వహించే విద్యాసంస్థల బంద్ కార్యక్రమ పోస్టర్లను ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ఓ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో వారు ఆవిష్కరించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే యోచనను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఉద్యమించాలన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో సీమలోని యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యాసంస్థల బంద్‌కు అన్ని యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఆయా విద్యార్థి సంఘాల నాయకులు సురేంద్రబాబు, రంగస్వామి, ఖాదర్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సర్వే



ఎమ్మిగనూరు ఎన్టీఆర్ కాలనీలో సర్వేలో పాల్గొన్న కేంద్రబృందం, జిల్లా వైద్య శాఖాధికారులు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై శుక్రవారం నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్–6)ను పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, శివన్న నగర్‌లలోని డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీ ఏరియాల్లో కేంద్ర బృంద సభ్యులు సర్వే చేశారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో ఎంపిక చేసిన 300 గృహల్లో ప్రీఎడ్యుకేషన్ ఆదోని డివిజన్ టీం సభ్యులు, 22 గృహాల్లో కేంద్ర బృంద సభ్యులు సర్వే చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, లబ్ధిదారులకు అందాల్సిన ఆర్థిక అంశాలు, ఆరోగ్య సూచిలపై సమగ్ర గణాంకాలు, నివేదికల కోరకు ఆయా గృహల్లోని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే నివేదికను కేంద్రానికి పంపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సర్వేలో వచ్చిన సమాచారం మేరకు ప్రభుత్వ ఆరోగ్య సేవలు మరింత పటిష్టంగా అమలు చేసేందుకు కావాల్సిన ప్రణాళికలు తయారు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కేంద్ర బృంద సభ్యులు శైలజ, సుమలత, వెంకటరమణ, నాగబాష, రవి, శిరీష, అనిల్‌కుమారి, సాయికుమార్‌లతో పాటు జిల్లా టీం సభ్యులైన డీఎంహెచ్ఓ కార్యాలయ స్టాటిస్టికల్ ఆఫీసర్ హేమసుందరం, ఎంపీహెచ్ఈఓలు నరసప్ప, శ్రీనివాసమూర్తి, వేణుగోపాల్, కృష్ణమోహన్, శ్రీధర్, ఉమాపతి,యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

శుద్ధి చేసిన తర్వాతే తాగునీటి సరఫరా



వెల్దుర్తి 14వ వార్డులో నీటి సరఫరాను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెల్దుర్తి (కృష్ణగిరి): గత ప్రభుత్వ హయాంలో వెల్దుర్తిలో 15 రోజులకోసారి కుళాయిలకు నీరు వచ్చేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఇచ్చిన మాట మేరకు మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసి తాగునీటి సమస్య తీర్చారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని పలు వార్డులకు తాగునీటి సరఫరా చేసే డోన్ రైల్వే గేట్ల వద్ద గల సంప్‌ను జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మునెయ్య, మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ నాగేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడులతో కలిసి పరిశీలించారు. కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి సరఫరా అయ్యే నీటి నాణ్యతను, సంప్ వద్ద జరిగే క్లోరినేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని 14వ వార్డులో కుళాయిలకు సరఫరా అయ్యే నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా బొమ్మన రవిరెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల పట్టణంలోని ప్రజలకు శుద్ధి చేయకుండానే నీటి సరఫరా జరుగుతోందన్న సీపీఐ నాయకుల ఆరోపణల్లో, పత్రికల్లో వచ్చిన వార్తలో వాస్తవం లేదన్నారు. క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు అందిస్తున్నామన్నారు. అనంతరం స్థానిక బీసీ బాలకల హాస్టల్‌లో నీటి సౌకర్యం మెరుగుపడేలా తీసుకోవాల్సిన చర్యలపై వార్డెన్ శైలజతో సమీక్షించారు. సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ సైతం నీటి సరఫరాను తనిఖీ చేసి వాస్తవాలను తెలుసుకోవడం విశేషం.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా పేదలకు వరం అని గ్రామ సర్పంచ్ తోట సావిత్రి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం–1 పరిధిలోని నామినీ పులికొండకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలను వార్డు మెంబర్లు నాగన్న, మునీ అందజేశారు. ఆయన భార్య దేవ్పళ్ల రంగమ్మ (47) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో వైఎస్సార్ బీమా మంజూరైఇది. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసిస్టెంట్ వీరుపాక్షి మాట్లాడుతూ మిగతా సొమ్ము వారం రోజుల్లో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వివరించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు యంకప్ప, వలంటీర్ నాగలక్ష్మీ ఉన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నందవరం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సీహెచ్ఓ బలరాం సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు కనకవీడు, నాగలదిన్నె, ముగతి తదితర గ్రామాల్లో ఫ్రై డే– డ్రై డే కార్యక్రమంలో భాగంగా డ్రైనేజీలు, నీటి కుంటలు, మురికి కాలువలలో వైద్యాధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఇంటి ఆవరణలో టైర్లు, కొబ్బరి బోండాలు, మురుగు కాలువలలో నీరు నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే ల్యార్వా ద్వారా దోమలు వ్యాప్తి చెందుతుందన్నారు. ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను పాటించాలి

గోనెగండ్ల: పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలు జాతి నిర్మాణంతో పాటు విశ్వకళ్యాణానికి దోహదపడుతున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని పుట్టపాశం గ్రామంలోని శివాలయం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా శుక్రవారం గోపూజ, కుంకుమార్చనతో పాటు ధార్మిక సభా నిర్వహించారు. అంతకుముందు ఆంజనేయ స్వామి దేవస్థానం నుంచి శివాలయం వరకు గోమాతతోనగర సంకీర్తన,శోభాయాత్ర చేశారు. మూడు రోజుల పాటు మేడా సుబ్రహ్మణ్యం స్వామి చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను అలరించాయి. సర్పంచ్ నరసింహారెడ్డి, ధార్మిక ప్రవచకులు రామచంద్రుడు, అర్చకులు నంబి రాజు, విశ్రాంత సహకార బ్యాంకు మేనేజర్ చెన్నూరు ఈశ్వర రెడ్డి, తిమ్మగురుడు, పెద్ద నాగన్న, రామకృష్ణ, గంగాధర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భజన బృందాలకు బహుమతుల ప్రదానం

గోనెగండ్ల: శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల నెల పూజ సందర్భంగా నిర్వహించిన భజన పోటీల్లో గెలుపొందిన బృందాలకు గ్రామ పెద్దలు శుక్రవారం బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి అలంకొండ బృందానికి 30 తులాల వెండిని ప్రభాకర్ నాయుడు చేతుల మీదుగా అందజేశారు. తర్వాతి స్థానాలకు వరుసగా.. హలిగేరికు 20 తులాల వెండి, ఒంటెడుదిన్నెకు 15, హెచ్.కైరవాడి, గుద్రంపాడుకు 10.5 తులాల వెండి, శంకరాపురం , విరుపాపురానికి 10, హెచ్.కైరవాడికి 8, తురవగల్లుకు 5.5, పాణ్యంకు 5, ఎర్రకోటకు 2.5, యనగండ్లకు 2 తులాల వెండి, అయినగల్లుకు గోడ గడియారం బహుమతులుగా అందజేశారు. ఆలయ పూజారులు లక్ష్మయ్య, మాల్దకల్, ఓబులయ్య, చంద్రశేఖర్, నరసింహ, రవి అహోబిలం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫ్రైడే–డ్రైడే పరిశీలన

దేవనకొండ: మండలకేంద్రంలోని సచివాలయం–2 పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి నూకరాజు పరిశీలించారు. దోమల వల్ల కలిగే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిల్వ ఉంచే డ్రమ్ములు, తొట్టెలపై మూతలు కచ్చితంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా, వైద్య సిబ్బంది శ్రీధర్, వెంకటమ్మ, మాదమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వలసలు వద్దు.. ఉపాధి కల్పిస్తాం

మద్దికెర: వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామాల్లో పనులు లేకపోవడంతో వ్యవసాయ కూలీలు పట్టణ ప్రాంతాలకు వలస వెళుతున్నారని, అలాంటి వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో ఉపాధి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలసల నివారణకు అమలు చేస్తున్న మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందన్నారు. కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం



యాదరాళ్ల టోపుల ఎల్లమ్మ ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి (కృష్ణగిరి): మండల పరిధిలోని యాదరాళ్ల గ్రామ టోపుల ఎల్లమ్మ ఆలయానికి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉప్పరి కృష్ణ, లక్ష్మి దంపతులు రూ.8 లక్షలతో నిర్మించిన ముఖద్వారాన్ని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం ప్రారంభించారు. కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి సతీమణి కంగాటి వాసంతితో కలిసి పూజాది కార్యక్రమాలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి ప్రధాన రహదారి వరకు నిర్మించనున్న రోడ్డుకు భూమిపూజ చేశారు. వెల్దుర్తి సచివాలయాల కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, బోయనపల్లె అశోక్‌రెడ్డి, అల్లుగుండు శ్రీరాంరెడ్డి, లింగమూర్తి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మారెమ్మవ్వ ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం



గద్దెరాళ్ల మారెమ్మవ్వ ఆలయ జీర్ణోద్ధరణకు భూమిపూజ చేస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు

ఆలూరు: దేవనకొండ మండలం గద్దెరాళ్ల గ్రామంలో కొలువుదీరిన మారెమ్మవ్వ ఆలయ జీర్ణోద్ధరణకు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ రంగస్వామి ఆధ్వర్యంలో దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణస్వామి తదితరులు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శంకుస్థాపన చేశారు. అలాగే భూమిపూజ నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, మండల ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో గ్రామ దేవత ఆలయాన్ని పునఃనిర్మించేందుకు పూనుకున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, దాతల సహకారంతో పోగుచేసిన రూ.23,40,000, దేవదాయ శాఖ సర్వశ్రేయ నిధి నుంచి రూ.93,60,000 కలుపుకుని మొత్తం అంచనా వ్యయం రూ 1,17,00,000 నిధులతో నిర్మాణ పనులు చేపట్టినట్టు వివరించారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున, రాజారెడ్డి, ఉమాంబ, చంద్రన్న, ప్రభాకర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, రంగడు, తిమ్మప్ప, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో సువర్ణపాలన సాగుతోందని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ చేరుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం 'రాష్ట్రానికి జగనన్నే ఎందుకు సీఎం కావాలి' కార్యక్రమంలో భాగంగా దేవనకొండలోని సహకార పరపతి సంఘం కల్యాణ మండలంలో మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేశారని వివరించారు. గతంలో సంక్షేమ పథకాల పేరిట టీడీపీ నాయకులు దోచుకున్నారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని సూచించారు. అందరి సహకారంతో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం అందిద్దామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, రాంభీమ్‌నాయుడు, మల్లికార్జున, అరుణకుమార్, ప్రభాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

మద్దికెర: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంపీపీ అనిత ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మండలంలోని ఎం.అగ్రహారం, హంప, బొమ్మనపల్లి, మదనంతపురం, బసినేపల్లి గ్రామాలలో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, శాశ్వత పరిష్కారం చూపాలని సర్పంచులు విజయుడు, ఆంజనేయులు కోరారు. పెరవలి బీసీ కాలనీలో ట్యాంకు ఉన్నా నీరు సరఫరా కాకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ జ్యోతిలత, స్థానిక పందులకుంటలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారని ఎంపీటీసీలు రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఏఈ ఉమాకాంత్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు రేపు ప్రత్యేక ఓటరు నమోదు



వెల్దుర్తి మెయిన్ స్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఆర్ఐ

ఆలూరు రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలూరు అసెంబ్లీ అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ రామాంజనేయులు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈ నెల 27న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశారన్నారు. జాబితాలో తప్పులు, సవరణలు ఉంటే ఫారం–7 సమర్పించాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. అలాగే వయసులో వ్యత్యాసాలున్నా, ఓటరు ఇంటి అడ్రస్, వ్యక్తిగత వివరాలు మార్పులు చేర్పులకు వెసులుబాటు కల్పించారన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

వెల్దుర్తి (కృష్ణగిరి): మండలంలో శని, ఆదివారం ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఓటరు నమోదు, సవరణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి సదుపాయాలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో కేంద్రంలో ఉండాల్సిన సౌకర్యాలపై ఆరాతీశారు. ఆర్ఐ మస్తాన్, వీఆర్ఓలు, బీఎల్ఓలు ఉన్నారు.

కృష్ణగిరి: మండలవ్యాప్తంగా శని, ఆదివారాల్లో ఓటర్ నమోదు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు.